## 1983 ఉగాది కథానికల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ!

"రేపటి నుంచి ఫ్యాక్టరీకి వెళ్ళనవసరం లేదు" అన్నాడు చలపతి చేతిలో బ్యాగ్ భార్యకి అందిస్తూ.

"అదేం! వుద్యోగంలోంచి తీసేశారా" అంది సునంద కంగారుగా.

"అలాంటిది ఏమీ లేదుకానీ మా వాళ్ళు సమ్మె చేస్తున్నారు" అన్నాడు అతను బట్టలు మార్చుకుంటూ.

"ఎందుకు?"

"జీతాలు పెంచమని."

"పోయిన జనవరిలోనే కదా మీకందరికీ జీతాలు పెంచారు. అప్పుడే మళ్ళీనా—"

"దానికీ దీనికీ సంబంధం లేదు."

"ఎలా?"

"పోయినజనవరిలో మామూలుగా ఎగ్రిమెంటు ప్రకారం "వేజ్ రివిజన్" జరిగింది. కానీ ఇప్పుడు మేము చేస్తున్నది మళ్ళీ వేజ్ రివిజన్ కోసం కాదు. ఈ నగరంలోనే వున్న మరో కర్మాగారంలోని కార్మికులకు ప్రభుత్వం మాకంటె హెచ్చు వేతనం ఇస్తోంది. వారితో సమానంగా మాకు కూడా జీతాలు కావాలని. మా కంపెనీతో పాటు ఇంకా నాలుగు అయిదు కంపెనీ కార్మికులు మూక ఉమ్మడిగా సమ్మె చేస్తున్నాము."

"అయినా అందుకు సమ్మె చేయటం ఎందుకు? మామూలుగా అడిగితే ప్రభుత్వం ఈ అసమానతలు తొలగించదా?"

"ప్రభుత్వం ఈ విషయం పెడచెవిని పెట్టింది. కాబట్టే సమ్మె చేయవలసి వచ్చింది."

"అయితే ఎన్నాళ్ళు జరుగుతుంది?"

"ఏమో చెప్పలేం. వారం రోజులలో తేలిపోవచ్చు. లేదా నెల రోజులు పట్టవచ్చు."

"ప్రభుత్వం మీ కోర్కెలు అంగీకరిస్తే మీకు జీతం ఎంత పెరగవచ్చు?"

"దాదాపు వంద రూపాయలు."

"అమ్మో! ఒక్కసారిగా వంద రూపాయలే!"

"అవును."

"అంటే ఇప్పుడు నెలకు వంద రూపాయలు నష్టపోతున్నామన్నమాట" అంది సునంద దిగులుగా.

"కరెక్టు."

"అయితే మిమ్మల్ని ప్రభుత్వం సవతి కొడుకులను చూసినట్టు చూస్తోందన్న మాట" అంది ఆమె కసిగా.

అవకాశం దొరికితే ప్రభుత్వాన్ని గట్టిగా నాలుగు చీవాట్లు పెట్టాలన్నంత కోపంలో వుంది ఆమె.

"ఇలా నెలకి వందరూపాయల చొప్పున నష్టం ఎంతకాలం నుంచీ జరుగుతోంది?" అంది ఆమె మళ్ళీ.

"దాదాపు రెండేళ్ళు."

"అంటే రెండు వేలకు పైచిలుకు గంగపాలు అయినట్టేగా!"

"కామలే, సమ్మె ముగిసిన తరువాత ప్రభుత్వం ఎంతో కొంత ఎరియర్స్ రూపంలో ఈ నష్టానికి పరిహారం చెల్లిస్తుంది."

"బాగుంది. అయితే మీరు మాత్రం ప్రభుత్వం ఒప్పుకునేవరకూ సమ్మె విరమించకండి" అంది సునంద ఉద్రేకపడిపోతూ.

ఆ సమయంలో ఆమె ఒక ట్రేడ్ యూనియన్ లీడర్‌లా ఆవేశపడిపోసాగింది.

"ఇంకొకసారి మేము ఎప్పుడైనా సమ్మె చేయవలసి వస్తే మా వర్కర్స్‌ను నువ్వు లీడ్ చేద్దువుగానిలే" అన్నాడు చలపతి.

సునంద అతని మాటలలోగల వ్యంగ్యం గ్రహించి చప్పున మామూలు మనిషి అయిపోయింది.

"పోనీ లెండి! ఈ చలిలో ఉదయమే లేచి మీకు వంట చేయటం మహా కష్టంగా వుంది. కొన్నాళ్ళు నాకు ఆ బాధ వుండదు."

"నీకే కాదు, నాకు ఎనిమిది గంటల డ్యూటీ నుంచి విముక్తి. "హేపీ డేస్ ఆర్ హియర్ ఎగైన్" అన్నట్టు ఇవాల్టి నుంచి నేను బాబిగాడితో ఆడుకోవటానికి బోలెడు టైము" అంటూ చలపతి, తప్పటడుగులు వేస్తూ వచ్చి తన కాళ్ళకు చుట్టుకున్న బాబిగాడిని ఎత్తుకున్నాడు.

ఏదో అర్థం అయినట్టుగా బాబిగాడి మొహంలో చిరునవ్వులు.

* * *

తెల్లవారింది.

డ్యూటీ లేనందువల్ల చలపతి మత్తుగా దుప్పటికిందపడుకుని సమ్మెలోగల హాయిని అనుభవిస్తున్నాడు.

"ఏమే! తెల్లగా తెల్లవారిం తరువాత వచ్చావు. పని ఎప్పటికి అయ్యేను" అంటూ సునంద అప్పుడే వచ్చిన పనిమనిషి మీద చార్జెస్ ఫ్రేం చెయ్యసాగింది.


"చలికి మెలకువ రాలేదమ్మా. కొంచెం వేడి కాఫీ పొయ్యండి. తాగి పది నిముషాల్లో గిన్నెలు తోమేస్తాను" అంది ఆమె.

"ఇది మరీ బాగుంది. ఇదేం హోటలు అనుకున్నావా. రాగానే వేడి కాఫీ కావాలంటున్నావు. ముందు వాకిట్లో ముగ్గు వెయ్యి, తరువాత గిన్నెలు తోము."

"అదేంటమ్మగారూ. మీరు తాగుతున్నారు గదా, నాకు కూడా ఇన్ని కాఫీ పోస్తారని ఆశపడ్డాను" అంది పని మనిషి ఏమాత్రం జడవకుండా.

"నేను తాగుతుంటె మాత్రం నీకివ్వాలని ఎక్కడుంది. అయినా మాతో నీకు సమానం ఏమిటి" అంది సునంద కాలుతున్న కాఫీ గ్లాసును మరో చేతిలోకి మార్చుకుంటూ.

"సమానం ఎందుకు కాదు. మీరూ మను



షులే. మేమూ మనుషులమే!"

"అయితే?"

"నేనూ మనిషినే కాబట్టి నాకూ అంతే చలి వేస్తుంది. అందువల్ల వేడి కాఫీ కావాలన్నాను. ఇస్తే ఇయ్యండి. లేకపోతే లేదు" అంది పనిమనిషి — ఆధునిక సమాజంలో మానవుడి మనుగడ- అన్న సభలో వక్తలా.

"నెల అయిన తరువాత జీతం ఇస్తానన్నాను కానీ మధ్యలో నువ్వు కాఫీ అడిగితే ఇవ్వాలన్న ఒప్పందం మన మధ్య లేదు" అంది సునంద తను ఖాళీ చేసిన కాఫీ గ్లాసు అంట్ల గిన్నెలలో పడవేస్తూ.

పనిమనిషి మారు మాట్లాడకుండా చీపురు తీసుకుని వాకిలి ఊడవడంకోసం వెళ్ళిపోయింది.

# రాక్షస న్యాయం

మీరా




ఈ గొడవకి ఇక నిద్ర సాగదని లేచి, దంతధావనం చేసి వంట గది ప్రవేశం చేశాడు చలపతి.

సునంద భర్తకి కాఫీ అందించింది.

"గ్లాసుడు కాఫీ భాగ్యానికి పని మనిషి మీద అంతలా అరుస్తున్నావేమిటి?"

"మీకు తెలియదు. వీళ్ళకు ఇలాంటివి అలవాటు చెయ్యకూడదు."

"అలవాటు ఎందుకు అవుతుంది. వాళ్ళు మాత్రం రోజూ అడగరు కదా?"

"ఒక్కసారి ఇస్తే రోజూ అడుగుతారు."

"అడిగితే అప్పుడు ఇవ్వవద్దు. ఇవాళ మరీ చలిగా వుందని ప్రాధేయపడిందిగదా పాపం!"

"వీళ్ళమీద జాలిపడకూడదండీ. ఇవాళ కాఫీ అడిగింది రేపు టిఫిను కావాలంటుంది. వీళ్ళకి ఎంత ఇచ్చినా తృప్తి వుండదు."

"నువ్వు మరీ అన్యాయంగా మాట్లాడుతున్నావు. కాస్త కాఫీ ఇస్తే మనకి మాత్రం తరిగిపోయేది ఏముంది?"

"మనకి తరిగిపోకపోయినా వాళ్ళు అడిగిందల్లా మనం ఇవ్వకూడదు. ఇస్తే సుఖం మరిగిపోయి, పని సరిగా చెయ్యరు."

"అక్కడే నువ్వు పొరపడుతున్నావు. వేడి కాఫీ తాగిన తరువాత నూతనోత్సాహంతో చురుకుగా, నీటుగా పనిచేస్తారు. నువ్వు కాఫీ ఇచ్చావన్న కృతజ్ఞతతో ఎక్కువ పనిచేయటమే కాక, గిన్నెలు తోమేటప్పుడు క్లీనింగ్ పౌడరు వృధా కాకుండా జాగ్రత్త తీసుకుంటారు. ఇదంతా నీకు లాభమే కదా!"

ఎలాగైనా సునందని కన్విన్సు చేసి పని మనిషికి కాఫీ ఇప్పించాలని చలపతి ప్రయత్నం.

అతని మాటలకు సునంద పెద్దపెట్టున నవ్వసాగింది.

చలపతికి ఏమీ అర్థం కాలేదు.

కొంతసేపటికి సునంద

"పని మనిషికి కాఫీ ఇవ్వకుండానే మనం ఆమె చేత మీరు చెప్పినట్లు లాభదాయకమైన రీతిలో పని చేయించుకోవచ్చు. మనం కాస్త జాగ్రత్తగా అజమాయిషీ చేస్తే చాలు."

సునంద చెప్పిందీ కరెక్టే అనిపించింది. కానీ చలపతి మనసులో ఎక్కడో చురుక్కుమంది.

ప్రతి యజమానీ, తన కింది పనివారితో ఇదే పద్ధతిలో వ్యవహరించేటట్లయితే, ఈ రోజున కార్మికులకి, ఓవర్ టైము అలవెన్సు, ఇన్సెంటివ్, బోనస్‌లాంటివి ఏమీ ఇవ్వనక్కరలేదు.

అన్నీ పొందుతూ కూడా ఇంకా ఏదో సమానత్వం కోసం తమ కంపెనీ కార్మికులు సమ్మె చేస్తున్నారు.

అయితే ఈ సమ్మె విజయవంతం అవుతుందా!

ఈ సమాజంలో సమానత్వం అనేది సాధించటం కానీ, తీసుకురావటం కానీ సాధ్యపడుతుందా? ఆనాటి రామరాజ్యం నుంచి నేటి అమెరికన్ రాజ్యం వరకూ

ఎక్కడా లేని సమానత్వం కావాలని సమ్మె చేయటం సమంజసమా?

అసలు సృష్టిలోనే ఎన్నో అసమానతలు, అవకతవక లున్నాయి.

అసలు సమ్మె ఎందుకు చేయాలి?

నాకిది కావాలని ప్రతివారూ తన స్వలాభం కోసం, స్వార్థం కోసం సమ్మె చేయటమే కానీ—

తనకంటె దిగువస్థాయిన గల వాడి కోసం, తన కంటె దరిద్రుడు అయిన వాడి కోసం, తన కంటె ఎక్కువ కష్టపడుతూ తక్కువ ప్రతిఫలంతో అన్యాయానికి గురి అవుతున్న వారికోసం ఎవరూ ఎందుకు సమ్మె చెయ్యరు?

చలపతికి ఆలోచించగా, తాము ఇప్పుడు సమ్మె చేయటంలో ఔచిత్యం లేదనిపించింది. తమ కోర్కెలు ప్రభుత్వం అంగీకరించక పోవచ్చుననీ, అంతేకాక సమ్మె విఫలం అవుతుందనే అనుమానం కలగసాగింది.

కానీ తాను వ్యక్తిగతంగా చేయగలిగింది ఏమీ లేదు.

చేయవలసింది కార్మిక నాయకులు జరిపిస్తున్నారు. తాను కేవలం పదిమందిలో ఒకడు.

* * *

రోజులు గడుస్తున్నాయి.

చలి రోజురోజుకూ పెరుగుతోంది.

పెరిగిన చలిలో వణుకుతూ పనిచేస్తూనే వుంది పనిమనిషి.

జరిగింది మరిచిపోయి యజమానురాలి మనసుకు జాలి కలగకపోతుందా అన్న ఆశతో—పనికి ముందో, తరువాతో కాఫీ కావాలని అడుగుతూనే వుంది.

ఆమె అవసరం అలాంటిది.

ఆమె పరిస్థితికి జాలి పడవలసింది పోయి సునంద తన మామూలు ధోరణిలో విదిలించి వేస్తూనే వుంది.

కులాల.....

కులాల కుళ్ళుతో
కలహాలు చెలరేగుతుంటే



కలాలలో సిరాలున్నా
కవులలో చలనం లేదు.

—గంధం అర్జునరావు

కాని ఇదంతా గమనిస్తున్న చలపతికి మాత్రం మనసులో చాలా అశాంతి కలగసాగింది.

పని మనిషికి కాఫీ ఇవ్వాలనే షరతు లేకపోయినా, ఆమె కూడా మనలాంటి మనిషే అన్న విషయం గుర్తించి ఆమె కోర్కె తీర్చవచ్చుగదా. సాటి మనిషి పట్ల ఇంత క్రూరంగా, నిరంకుశత్వంగా ప్రవర్తించే ఈ సమాజంలోని మనుషులు మానవ వేషంలో తిరుగుతున్న రాక్షసులు.

ఇలాంటి రాక్షసుల మధ్య జీవించవలసి రావటం మరీ దౌర్భాగ్యం అనిపించసాగింది.

* * *

"ఏమండీ! ఎరియర్స్ రూపంలో డబ్బు వస్తుందన్నారు గదా, ఎంత రావచ్చు" అంది సునంద భర్త హృదయంపై గోముగా తల ఆనించి.

సాటి మనిషికి కాఫీ నీళ్ళు పోయకూడదనుకునే సునంద తనకి రాబోయే ఎరియర్స్ కోసం ఆరాటపడటం చలపతికి ఆశ్చర్యం కలిగించింది.

ఆ సమయంలో ఆమె స్వార్థం కరడు కట్టుకుపోయిన రాక్షసిలా—

మనుషులను ఆవహించి పీడించే దయ్యంలా—అగుపించసాగింది.

సునంద జవాబుకోసం రెట్టించసాగింది.

"ఏదీ ఇంకా తేలలేదుగా!"

"తేలక ఏంచేస్తుందిలెండి. ప్రభుత్వం మీ న్యాయమైన కోర్కెలు తీర్చకుండా ఎంతకాలం వుండగలదు?"

సునంద న్యాయం గురించి మాట్లాడుతుంటే చలపతి నవ్వుకున్నాడు.

'రాక్షస న్యాయం అంటే ఇలాగే వుంటుంది కాబోలు!'

"ఓ వెయ్యి రూపాయలు రావచ్చు" అన్నాడు చలపతి జవాబు చెప్పేదాకా ఆమె ఊరుకోదు కాబట్టి.


"అయితే ఆ వెయ్యి రూపాయలు పెట్టి ముత్యాల హారం చేయించుకుంటాను. మీ చెల్లెలి పెళ్ళి కూడా రాబోతూంది. నా పెళ్ళి అయిం తరువాత కొత్త నగ చేయించుకోలేదేమని మా వాళ్ళు నన్ను అడిగితే బాగుండదు" అంది సునంద.

చలపతి నవ్వి వూరుకున్నాడు.

* * *

చలపతి అప్పుడే బయటినుంచి వచ్చాడు.

"ఏమండీ! మీ వాళ్ళు సమ్మె విరమించుకున్నట్లు ప్రాంతీయ వార్తల్లో చెప్పారు. ఎరియర్స్ ఎప్పుడు వస్తాయి" అంది సునంద మొహం నిండా చిరునవ్వు చిందిస్తూ.



ఆమె కళ్ళ ముందు ముత్యాల హారం మెదులుతోంది.

"సమ్మె విరమించుకున్న మాట నిజమే కానీ-ఎరియర్స్ రావు."

అంతలోనే ఆమె మొహంలో చీకటి.

"ఎందుకని?"

"ప్రభుత్వం మాకోర్కెలు అంగీకరించ లేదు"

"అయితే సమ్మె కొనసాగించవలసింది."

"కొనసాగించితే మనకే నష్టం."

"ఎలా ?"

"సమ్మె చేసినంతకాలం 'లాస్ ఆఫ్ పే' అవుతుంది. చివరికి సాధించేది ఏమీ వుండదు."

"మరి వేతనాలలో అసమానత తొలిగేది ఎలా ?"

"నేషనల్ వేజ్ స్ట్రక్చర్ అమలు పరుస్తుందిట గవర్నమెంటు."

"అంటే?"

"అంటె ప్రభుత్వ ఉద్యోగులందరికీ. సమానమైన జీతాలు. ఒక కంపెనీలో హెచ్చు. ఒకరికి తక్కువలు లేకుండా ఒక స్థాయిలో వుండే వుద్యోగులందరికీ ఒకే జీతం."

"అలా చేసినా మీకు జీతం పెరగాలి కదా?"

"పెరగదు."

"ఏందువల్ల."

"మా కంపెనీ కార్మికుల కంటె తక్కువ జీతాలుతీసుకునే వారు చాలామంది వున్నారు.

## మాతృఘోష

ఆడదానిగా పుట్టాను
ఆనవాయితీగా
ఓ మగాడికి
ఆలినయ్యాను
ఆశలు, ఆశయాలు
అన్నీ అణగద్రొక్కి
మగాడిగా, మగడిగా
ఆ మనిషి చెలామణి అయినా
బాధ అంతగా కలగలేదు!
కాని
మాతృమూర్తి నవుతూంటే
మగహంకారికి తల్లినా?
నాలాంటి నిరాశాజీవికి తల్లినా?
అని నా తల్లి మనసు
తల్లడిల్లుతూంది!

—బి. శారదాదేవి

కాబట్టి మా జీతాలు తగ్గించి, వారి జీతాలు పెంచి. ఒక స్థాయికి తీసుకు వస్తారు. ఈ పథకంకింద నాకుపందరూపాయిలు జీతంలో తగ్గుతుంది."

ఈ మాట విని సునందకి నోట మాట రాకుండాపోయింది. ఏదో కొంప మునిగిపోయినట్టు, జీవితంలో సర్వం కోల్పోయినట్లు శూన్యంలోకి చూడసాగింది.

సునంద అలా దిగులు పడుతూంటె, చలపతికి సరదాగా వుంది.

"మన ఇంటిలో కూడా నేషనల్ వేజ్ స్ట్రక్చర్ అమలు చేస్తున్నాను" అన్నాడు చలపతి నవ్వుతూ.

"ఏమిటి మీ రనేది?"

"అవును! పని మనిషికి ఈరోజు నుంచి జీతం పెంచుతున్నాను. ఆమెకు ఎరియర్స్ ప్లస్ బోనస్ క్రింద వంద రూపాయలు మంజూరు చేశాను" అన్నాడు చలపతి.

అనటమేకాక ఆ మరునాడు పని మనిషికి స్వయంగా కాఫీ ఇచ్చి వంద రూపాయలు చేతిలో పెట్టాడు.

సునంద కొయ్యబారిపోయింది.

పనిమనిషి కళ్ళల్లో కృతజ్ఞత.

చలపతికి ఇప్పుడు ఎంతో ఆత్మ సంతృప్తిగా వుంది.

సమ్మె విఫలం అయి, నెలరోజుల జీతం నష్టపోయినా కించిత్తు బాధగా లేదు.

